క్లుప్తంగా

ఘనంగా నృసింహ యజ్ఞం



యజ్ఞం చేస్తున్న వేద పండితులు

బీచ్ రోడ్డు: శ్రీనృసింహ జయంతి ఉత్సవాల్లో భాగంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి దేవాలయంలో నృసింహ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం యజ్ఞ కుండీని అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా యజ్ఞం జరిపారు. అనంతరం హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ భక్తదాస మాట్లాడుతూ నృసింహ స్వామి అవతారం విశిష్టతను భక్తులకు వివరించారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ ప్రాంతం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనులు శుక్రవారం జరగనున్నాయి. ఈ మేరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతువాక కొండవాలు పరిసరాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాలికను రక్షించిన లైఫ్ గార్డ్స్

అల్లిపురం: బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన మైనర్ ఒకరు ఉదయం నొవోటెల్ హోటల్ వద్ద బీచ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించగా అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ రాజు, కల్యాణ్, పోలిరాజులు రక్షించి మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమ వ్యవహారం కారణంగానే బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు.

రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు సిద్ధం



రక్షణగిరి పుణ్య క్షేత్రం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర ప్రధాన మహోత్సవం మే 14న నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిఏటా ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫాదర్ దుగ్గింపూడి బాలశౌరీ చేత పతాకావిష్కరణతో ప్రారంభమవు తుందన్నారు. శనివారం నుంచి 14వ తేదీ వరకు జరిగే వేడుకల్లో జపమాల, దివ్యబలిపూజతో పాటు ధ్యానాంశాలు బోధిస్తారన్నారు వెల్లడించారు. శుక్రవారం నవదిన ప్రార్థనలతో రక్షణగిరి పుణ్య క్షేత్ర మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



వెంకటలక్ష్మి

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. లక్ష్మీపురానికి చెందిన ఒప్పంగి వెంకటలక్ష్మి(35) ఈనెల 2వతేదీన సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లి తిరిగిరాలేదు. వెంకటలక్ష్మి భర్త ఒప్పంగి సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె జాడ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ప్రకాష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ పార్సిల్ సర్వీసుకు ఆదరణ

- షిప్ మంత్రతో ఇంట్లోనే బుకింగ్ సదుపాయం
- నకాలంలో డోర్ డెలివరీ
- ఏడాదికి 1.17 లక్షల బుకింగ్‌లు



మద్దిలపాలెం పార్సిల్ కేంద్రంలో బుకింగ్ తీసుకుంటున్న సిబ్బంది

మద్దిలపాలెం: ఆర్టీసీ ప్రజా రవాణాతో పాటు పార్సిల్ సర్వీసుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల డోర్ డెలివరీ సదుపాయం ఆరంభించింది. ఇందు కోసం మద్దిలపాలెం డిపో వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకూ ఏఎస్ఎల్ ద్వారా పార్సిల్ సర్వీసు ఉండేది. దీనికి ఒక అడుగు ముందుకేసి డోరు డెలివరీ సర్వీసు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఏడాదికి రూ.1.50 కోట్ల ఆదాయం

మద్దిలపాలెం డిపోలో ఏర్పాటు చేసిన పార్సిల్, డోరు డెలివరీ సర్వీసుకు ఆదరణ బాగుంది. పార్సిల్ సర్వీసు ద్వారా సమకూరుతున్న ఆదాయం ఆశాజనకంగా ఉంది.

- రోజుకు సుమారు 322 పార్సిళ్లు బుకింగ్ అవుతున్నాయి.
- ఏడాదికి సుమారు 1.17 లక్షలు బుకింగ్‌లు జరుగుతున్నాయి.
- రోజుకు సుమారు 175 డెలివరీలు చేస్తున్నారు.
- వీటి ద్వారా రోజుకూ సుమారు రూ.35 వేలు ఆదాయం వస్తుంది.
- ఏడాదికి సరాసరి రూ.1.50 కోట్ల ఆదాయం వస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు.

డోరు డెలివరీ సదుపాయం ఉన్న నగరాలు

నగరంలో 10 కిలోమీటర్ల వరకూ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నారు. బుక్ చేసిన పార్సిల్‌ను సురక్షితంగా ఇంటి వద్దకే డెలివరీ చేసేలా సిబ్బందికి తర్ఫీదు ఇచ్చారు. అందుకు తగ్గట్టుగా సిబ్బందిని ప్రత్యేకంగా నియామకం చేపట్టారు. విశాఖ నగరంతో పాటు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి నగరాలలో ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉంది.

ధరలు ఇలా..

కేజీ పార్సిల్ వరకూ రూ.15లు, కేజీ నుంచి 6 కేజీల వరకూ రూ.25లు, 6 కేజీల నుంచి 10 కేజీల వరకూ రూ.30లు వసూలు చేస్తున్నారు. వీటికి జీఎస్టీ అదనం. తక్కువ చార్జీలతో భద్రంగా ఇంటి వద్దకే పార్శిల్ అందిస్తుండడంతో ప్రజల నుంచి స్పందన లభిస్తోంది.

షిప్ మంత్రతో ఇంట్లోనే బుకింగ్

సుదూర ప్రాంతాల్లో ఉన్న మీ బంధువులు, స్నేహితులకు ఏదైనా పంపించాలనుకుంటున్నారా?.. అయితే ఎలా పంపించాలని చింతించకండి. మీ పార్శిల్ మీ ఇంట్లో కూర్చునే బుక్ చేసుకోవచ్చు. అందుకు ఆర్టీసీ పార్సిల్ సర్వీసు ఇప్పుడు కొత్తగా షిప్ మంత్ర పేరిట ఆన్‌లైన్ బుకింగ్ సర్వీసుకు శ్రీకారం చుట్టింది. ఎంచక్కా ఇంట్లో కూర్చుని వస్తువులను ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.షిప్‌మంత్ర.కామ్‌ను సందర్శించండి. పార్సిల్ కౌంటర్ వద్ద క్యూలో నిల్చోకుండానే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పార్సిల్‌ను బుక్ చేసుకోవచ్చు. ఆర్టీసీ సిబ్బంది మీ ఇంటికి నేరుగా వచ్చి పార్సిల్ స్వీకరిస్తారు. ఈ పార్సిల్‌ను 24 గంటల్లోగా పంపించడానికి ఫాస్ట్ సర్వీసు సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి తెలిపారు.



అరుణకుమారి, మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్

బాబోయ్.. శునకాలు.!

- గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- పిల్లల తల్లిదండ్రుల ఆందోళన
- ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం

ఆరిలోవ: నగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఆరిలోవ ప్రాంతంలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. రోజూ ఏదో ఒక చోట కుక్క కాటు బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆరిలోవలో జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఆస్పత్రి)లో నెలలో పదుల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. వారం వ్యవధిలో ఈ ప్రాంతంలో సుమారు 15 మంది కుక్కకాటుకు గురయ్యారు. బుధవారం డ్రైవర్స్ కాలనీ శివాలయంలో పూజ చేయడానికి వెళ్తున్న అర్చకుడిపై ఓ కుక్క దాడి చేసి కాలుపై కాటు వేసింది. నాలుగు రోజుల క్రితం సుందరయ్య కాలనీలో బిస్కెట్ ప్యాకెట్ పట్టుకొని ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చిన ఐదేళ్ల బాలికపై రెండు కుక్కలు దాడిచేసి పొట్టపై పేగులు కనిపించేలా ముక్క పీకేశాయి. అదే రోజు భరత్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో చేపలు విక్రయిస్తున్న మహిళను అక్కడ తిరుగుతున్న ఓ కుక్క కరిచి గాయపరిచింది. ఇలా రోజూ కుక్కలు దాడి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లల్ని వీధిలోకి పంపించాలంటే భయపడుతున్నారు. అసలే పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో ఇళ్ల వద్దే ఉంటున్న పిల్లలు ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్డుపైకి వచ్చి ఆటలాడుకుంటున్నారు. ఆ సమయంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని వారి తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ముడసర్లోవ పరిసరాలు, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, లీలాసుందరినగర్, టీవీసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, గాంధీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం, హనుమంతువాక, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు కుక్కలు గుంపులుగా తిరుగుతూ వెంటాడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులను కూడా వదలడం లేదని అంటున్నారు. బైకులపైకి అమాంతంగా దూకుతుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ముడసర్లోవ వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

నెలలో 50 మంది వరకు కుక్కకాటు బాధితులు

ఆరిలోవలోని జీవీఎంసీ ఎఫ్ఆర్‌యూలో నెలకు సుమారు 50 మంది కంటే ఎక్కువ సంఖ్యలో కుక్క కాటు బాధితులు నమోదవుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కుక్క కాటు బాధితులు వ్యాక్సిన్ కోసం వెళ్తున్నారు. దీంతో ఇక్కడ కుక్క కాటు వ్యాక్సిన్ నిరంతరం సిద్ధంగా ఉంచుతున్నామని వైద్యులు తెలిపారు.

'రాజాబాబుపై విమర్శలు అర్థరహితం'



సమావేశంలో మాట్లాడుతున్న పితాని ప్రసాద్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ మాజీ కమిషనర్ రాజాబాబుపై కార్పొరేటర్ మూర్తి యాదవ్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ అన్నారు. బీసీ, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని ఓ సమావేశ మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చాలా తక్కువ సమయం జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రాజాబాబు అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపట్టారని గుర్తు చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సదస్సులను విజయవంతంగా నిర్వహించడంలో సఫలీకృతమయ్యారన్నారు. నగరాభివృద్ధి కోసం విధానపరమైన నిర్ణయాలు తీసుకున్న రాజాబాబును లక్ష్యంగా చేసుకుని మూర్తియాదవ్ విమర్శలు చేయడం సరికాదన్నారు. తన ఆరోపణలపై మూర్తి వద్ద ఆధారాలు ఉంటే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో బయట పెట్టాలని సూచించారు. దళిత హక్కుల సంఘం నాయకుడు డాక్టర్ ముసుగు ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారిపై మూర్తి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కొయ్య ఆనంద రత్నకుమార్, డాక్టర్ ఎస్.మురళి, కండిపిల్లి శ్రీధర్, బీసీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన మహిళలు

డాబాగార్డెన్స్: మహిళా సాధికారతే లక్ష్యంగా స్కిల్ హబ్స్‌లో పలు కోర్సులు ఏర్పాటు చేయడం జరిగిందని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. 3 నెలల బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు గురువారం కళాశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్ ద్వారా అనేక మంది మహిళలకు పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చామన్నారు. దీనిలో భాగంగానే బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులు నిర్వహించామని చెప్పారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభించామన్నారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల పలువురు మహిళలు ప్రభుత్వ మహిళా కళాశాలలో శిక్షణ పొంది, సర్టిఫికెట్ అందుకున్న వారిని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ సాయికృష్ణ చైతన్య అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఓ డాక్టర్ కె సుధా, ట్రైనర్ ఏ పావణి, ఏపీఎస్ ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కే ప్రశాంతి, గోపాలరావు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్‌0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు బోదిలపాటి సత్య రూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, వి. మారుతీప్రసాద్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆస్తమాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రాధాకృష్ణ

బీచ్‌రోడ్డు: ఆస్తమా వ్యాధిపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని, లేని పక్షంలో ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్ కె.రాధాకృష్ణ అన్నారు. ఆస్తమా మాసోత్సవాల్లో భాగంగా రామ్‌నగర్‌లో ఓమ్నీ ఆర్కే ఆస్పత్రిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు ఆస్తమా బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఆస్తమా నియంత్రణకు ఆధునాతన వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఇన్‌హేలర్‌ను సక్రమంగా వినియోగించుకోకపోతే గాలి పీల్చుకోవడం కష్టమై ప్రాణాలకు ముప్పు తలెత్తుతుందని చెప్పారు.

కేంద్ర కారాగారానికి మందుల వితరణ



జైల్ సూపరింటెండెంట్ రాహుల్‌కు మందులు అందజేస్తున్న యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీల ఆరోగ్యం కోసం యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు కొన్ని రకాల మందులు పంపిణీ చేశారు. వాటిని గురువారం యంగ్ ఇండియన్స్ సంస్థ చైర్‌పర్సన్ కొడాలి రాయ్, డాక్టర్ శ్రావణి కారాగారాన్ని సందర్శించి ముందులను జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్‌కు అందజేశారు. రూ.2.50 లక్షలు విలువ చేసే మందులు అందజేసినట్లు యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ డెవెలప్‌మెంట్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఒ.నరేష్ కుమార్, జైల్ అధికారులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా నరసింహ చతుర్దశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిర్‌లో గురువారం నరసింహ చతుర్దశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామి దర్శనం, 8గంటలకు హారతి, గురుపూజ నిర్వహించారు. శ్రీ రాధా దామోదరులను వివిధ రకాల పువ్వులు, ఆభరణాలు, ప్రత్యేక దుస్తులతో అలంకరించారు. అనంతరం శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు లోక కల్యాణార్థం నరసింహ యజ్ఞం, సాయంత్రం కీర్తనలు, నరసింహస్వామికి అభిషేకం చేశారు.

సినీ రంగానికి దాసరి సేవలు చిరస్మరణీయం



దాసరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

ఎంవీపీ కాలనీ: సినీ రంగానికి దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఉత్తరాంధ్ర సినీ దర్శకుల సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సినీరంగ కళాకారులు పాల్గొని దాసరి చిత్రపటం వద్ద పూలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ కొత్తవారికి, నటనా చాతుర్యం ఉన్నవారికి సినిమా అవకాశాలు ఇవ్వడంలోను, సృజనాత్మకతను ప్రోత్సహించడంలోను దాసరికి ఎవ్వరూ సాటిరారన్నారు. ఎన్నో అద్భుతమైన సినిమాలు తీసిన ఆయన సేవలు చిరస్మరణీయం అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సినీ దర్శకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, నగర కళాకారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న శిక్షకుడు

ఎంవీపీ కాలనీ: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బాలవికాస్ సిటీ కో–ఆర్డినేటర్ మాధవి అన్నారు. ఉచిత వేసవి శిక్షణలో భాగంగా గురువారం ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో యోగాసనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు విలువలు, సామాజిక సేవ, క్రమశిక్షణ, శారీరక సామర్థ్యం పెంపుపై వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నంది బాలరత్న అవార్డు గ్రహీత సంపతిరావు ఆశిష్ విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు, టీచర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అవసరం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం నగర కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. పితాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అదాని డేటా సెంటర్ ఏర్పాటుతో వేలాది ఉద్యోగాలు యువతకు రానున్నాయని సీఎం చెబుతున్నారని, అయితే ఇప్పటికే ఉపాధి, ఉద్యోగాల కల్పతరువుగా ఉన్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ప్లాంట్ విక్రయానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు దేశ, రాష్ట్ర ఆర్థిక పురోగతికి మూల స్తంభాలని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరమం ఎంతైన ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు నిరసన చేస్తుంటే అడ్డుకోవడం, అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్కే ఎస్వీ కుమార్, కె.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరుస్తున్న రాంబో సర్కస్



సర్కస్‌లో విన్యాసం

బీచ్ రోడ్డు: ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాల ప్రదర్శనలతో రాంబో సర్కస్ నగర వాసులను అలరిస్తోంది. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వేదికగా ప్రదర్శిస్తున్న రాంబో సర్కస్‌కు నగర వాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 45 మంది కళాకారులు 20 ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరుస్తున్నారు. ఆదివారం వరకు ఈ రాంబో సర్కస్ ప్రదర్శనలు అందుబాటులో ఉండనున్నాయి.

శివాజీ సేవలు స్ఫూర్తిదాయకం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: కరోనా సమయంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు ఏవీఎస్ శివాజీ రెండో వర్ధంతిని ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రామ్‌నగర్ లయన్స్ క్లబ్ భవనం నందు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ జ్ఞాపకార్థం ఉపాధ్యాయులు రక్తధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యుడిగా, డీసీఈబీ సెక్రటరీగా పనిచేసిన శివాజీ విద్యారంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచి మిత్రుడు, విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన శివాజీ కరోనా బారిన పడి అందరికీ దూరం కావటం ఎంతో బాధాకరమన్నారు. శివాజీను స్మరించుకునేలా సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఈబీ సెక్రటరీ ఎంవీ. కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. సన్యాసిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ. దేముడుబాబు, రామిరెడ్డి, కోశాధికారి శ్రీధర్, సోమేశ్వరరావు, భాస్కర్, స్వామి నాయుడు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈపూజను నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.